# తండ్రి గారి సందేశం....



## దైవ వాక్కు క్రైస్తవ జీవనములో

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

క్రైస్తవ జీవనములో దైవవాక్కు ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. యేసు ప్రభువు కాలం నుండి నేటి వరకు విశ్వాసాన్ని వ్యాపింప చేయడానికి, దాన్ని కాపాడడానికి దైవవాక్కు దోహదపడింది. క్రైస్తవుల జీవితంలో విశ్వాసాన్ని దృఢపరచడంలో దైవవాక్కునకు చాలా ముఖ్యమైన స్థానం ఉంది. దైవవాక్కు నందు ఎదగాలంటే మూడు విషయాలను మనం గుర్తుంచుకోవాలి.

**1. దైవవాక్కును పఠించాలి.**

"పరిశుద్ధ గ్రంథాన్ని గురించిన అజ్ఞానం క్రీస్తును గురించిన అజ్ఞానమే" అన్నారు పునీత జెరోం గారు. కావున యేసు ప్రభువును తెలుసుకోవడం కోసం దైవవాక్కును పఠించడం అవసరమే. వాస్తవానికి మనిషిగా అవతరించిన దేవుని వాక్కు యేసు ప్రభువు. ఎందుకనగా యోహాను గారు అంటున్నారు. "ఆదిలో వాక్కు ఉండెను. ఆ వాక్కు దేవునిలో ఉండెను. ఆ వాక్కు దేవుడై ఉండెను" మరియు "ఆ వాక్కు మానవుడై మన మధ్య నివసించెను" (యోహాను 1:1,14). ఈ కారణం చేత యేసు ప్రభువును కనుకోవడానికి, తెలుసుకోవడాన్ని అరుదైన ఒక మార్గము పవిత్ర గ్రంథ పఠనం. అనుదినం దైవ వాక్కును పఠించేవారు క్రీస్తు ప్రేమలో ఎదుగుతూ ఉంటారు.

ఒక విధంగా చెప్పాలంటే దైవ వాక్కును మనం అనుదినం భుజించాలి. యావే దేవుడు యెహెజ్కేలు ప్రవక్తను పిలిచినప్పుడు అతనికి చెప్పారు. "నరపుత్రుడా! నేను నీకిచ్చు ఈ గ్రంథపు చుట్టను భుజించి దీనితో కడుపు నింపుకొనుము" (యెహెజ్కేలు 3,3). యావే దేవుడు చెప్పినట్లు ప్రవక్త చేశాడు (యెహెజ్కేలు 3,3). యిర్మీయా ప్రవక్త కూడా దేవుని వాక్కులను భుజించి గొప్ప ఆనందాన్ని అనుభవించారు (యిర్మీయా 15,16). ఈ విధంగా మనం కూడా దేవుని వాక్కును అనుదినం పఠించి శక్తిని పొందాలి.

**2. దైవ వాక్కును పాటించడం**

పఠించిన వాక్కులను మన జీవితంలో పాటించినప్పుడే అవి ఫలాన్నిస్తాయి. పునీత యాకోబు గారు అంటున్నారు. ''వాక్యమును కేవలము వినుటయేనని ఆత్మవంచన చేసికొనకుడు. దానిని ఆచరింపుడు" (యాకోబు 1,22). కావున దైవ వాక్కులను పాటించడం చాలా అవసరం. "విని మరచుట కాక దానిని అనుసరించువాడు దేవుని దీవెనలను పొందును" (యాకోబు 1,25). దైవ వాక్కును ఆలకించడం, చదవడం చాలా సులభం, కాని ఆచరించడం కష్టంతో కూడుకున్న పని. యేసు ప్రభువు చెప్పారు. "దేవుని వాక్కును ఆలకించి దానిని

పాటించువారు మరింత ధన్యులు" (లూకా 11,28). దైవ వాక్కును పాటించడం దైవ ప్రేమకు నిదర్శనం కూడా. యేసు ప్రభువు అన్నారు. "నన్ను ప్రేమించువాడు నా మాటను పాటించును" (యోహాను 14,23). ఇందువలన పఠించిన దైవవాక్కును శ్రద్ధా పూర్వకంగా పాటించాలి.

**3. దైవ వాక్కును ప్రకటించాలి**

దైవ వాక్కునందు క్రైస్తవుల జీవితం పరిణతి చెందేది పఠించి, పాటించిన వాక్కును ఇతరులకు ప్రకటించినప్పుడే. సువార్తను ప్రకటించడం అందరి బాధ్యత. పునీత పౌలు గారు అంటున్నారు. "సువార్తను బోధింపకున్నచో నా పరిస్థితి ఎంతో దారుణమగును" (1 కొరింతీ 9,16). యేసు ప్రభువు నుండి మనం విన్న విషయాలను మనం ఇతరులకు బోధించాలి. సువార్తను బోధించడం గురువుల, అమ్మగార్ల, ఉపదేశుల బాధ్యత మాత్రం కాదు. విశ్వాసులందరు సువార్తీకులే! అపోస్తలుల కార్యము 8వ అధ్యాయం వివరిస్తున్నట్లు యేసు ప్రభువు పునరుత్థానం తరువాత పలుచోట్ల సువార్త ప్రచారం చేసినది సామాన్య విశ్వాసులే. అపోస్తలుల కార్యములు 8,4 వివరిస్తుంది. "చెల్లా చెదరై పోయిన విశ్వాసులు సువార్తను ఎల్లెడల బోధించుచుండిరి" (అపోస్తలుల కార్యములు 8,4). ఈ విధంగా మనం కూడా మన ప్రాంతములో సువార్త ప్రచారం చేయాలి. ఇంకా చాలా మందికి యేసు ప్రభువు గురించి తెలియదు, వారు సువార్త వినలేదు. వారికి దేవుని వాక్కును వినిపించడం మన బాధ్యత. ఎందుకంటే "వినుట వలన విశ్వాసం కలుగును. వినుట క్రీస్తును గూర్చిన వాక్కు వలన కలుగును" (రోమీ 10,17). అందువలన మనం పఠించిన, పాటించిన దైవవాక్కును ప్రకటించాలి కూడా.

ఈ విధంగా దేవుని వాక్కులో ఎదుగడానికి మనం ప్రయత్నిద్దాం. దైవ వాక్కును పఠించి, పాటించి, ప్రకటిద్దాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

**"నీవు భయపడకుము, నేను నీకు తోడై యుందును. నీవు వెరువకుము, నేను నీకు దేవుడను. నేను నీకు బలము నొసగి నిన్ను ఆదుకొందును. నా శక్తితో నిన్ను కాపాడుదును" (యెషయా 41,10)**